

సోమశిలలో 29.430 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో బుధవారం సాయంత్రానికి 29.430 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 516 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం వచ్చి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.64,580
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,800
మూడు శాతం జీఎస్టీతో	రూ.5,974
సవర (8 గ్రాములు)	రూ.47,792

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.3 /25.0

బుధవారం గాలిలో తేమ 77 శాతం ఉంది. జిల్లాలో అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసింది. గురువారం కూడా జిల్లాలో జల్లులుపడే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

డిసెంబరు 15 నుంచి ఆడుదాం ఆంధ్రా పోటీలు

నెల్లూరు (దర్గామిట్ట): ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఆటల పోటీల నిర్వహణకు కలెక్టర్ ఎం.హరినారాయణన్, జేసీ కూర్మనాథ్, క్రీడాప్రాధికార సంస్థ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. గ్రామ స్థాయి నుంచి క్రీడలను ప్రోత్సహించేలా డిసెంబర్ 15వ తేదీ నుంచి 2024 ఫిబ్రవరి 3వ తేదీ వరకు ఎంపిక చేసిన క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో, ఐదు క్రీడాంశాలతో పాటు పోటీలేని క్రీడలు యోగ, టెన్నికాయిట్, మారథాన్ క్రీడలను నిర్వహించనున్నారు. పురుషులు, మహిళల కోసం ఐదు విభాగాల్లో వేర్వేరుగా క్రీడా పోటీలు నిర్వహిస్తారు. 15 సంవత్సరాలు వయస్సు పైబడిన వారు మాత్రమే ఈక్రీడల్లో పాల్గొనేందుకు అర్హులుగా ప్రభుత్వం నిర్ణయించింది. మరుగున పడ్డ క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసి ప్రోత్సహించేందుకే ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జేసీ కూర్మనాథ్ తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన కూరగాయల ఉత్పత్తి



జీవామృతం తయారీపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

మనుబోలు: ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో ఆరోగ్యానికి ఎటువంటి హాని కలిగించని నాణ్యమైన కూరగాయలను ఉత్పత్తి చేయవచ్చని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తెలిపారు. వీరంపల్లి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేస్తున్న మామిడి, బెండ, ఆకు కూర తోటలను వైఎస్సార్ క్రాంతి పథం బృందం బుధవారం పరిశీలించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసే కూరగాయలలో రోగ నిరోధక శక్తి అధికంగా ఉంటుందన్నారు. రసాయన ఎరువులు, మందులు వాడకపోవడం వల్ల మనుషులకు ఎటువంటి హాని కలిగించవన్నారు. అనంతరం జీవామృతం ఎలా తయారు చేయాలో వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం వనజాక్షి, సీసీలు జయమ్మ, ధనమ్మ, దేవమ్మ, రాజేశ్వరి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పవన్‌కుమార్, శ్రీనివాసులు, గీత, వెంకటరమణ ఉన్నారు.


ఆయుర్వేదంతో షుగర్ వ్యాధికి చెక్



రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ జగదీశ్వరి

మనుబోలు: ఆయుర్వేద వైద్య విధానం ద్వారా షుగరు వ్యాధికి చెక్ పెట్టవచ్చని మడమనూరు ఆయుర్వేద వైద్యురాలు జగదీశ్వరి తెలిపారు. మండలంలోని మడమనూరు ఆయుర్వేద వైద్యశాలలో బుధవారం షుగరు వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆహార నియమాలను పాటించడం, ప్రతి రోజూ కొద్దిపాటి వ్యాయామంతో షుగరు వ్యాధిని అదుపులో పెట్టుకోవచ్చన్నారు. మధుమేహాన్ని నియంత్రించేందుకు ఆయుర్వేదంలో ఎన్నో రకాల మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. రక్తంలో చక్కెరను నియంత్రించడంలో ఆయుర్వేద వైద్యం ఎంతో ఉపకరిస్తుందని, దీనివల్ల ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని తెలిపారు.

సొంతింటి కల నెరవేర్చడమే..



ఇళ్ల నిర్మాణ భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

కలువాయి: పేదల సొంతింటి కలను నెరవేర్చడమే లక్ష్యంగా జగనన్న ప్రభుత్వం కాలనీల పనులను శరవేగంగా పూర్తిచేసే దిశగా సాగుతోందని జెడ్పీటీసీ సభ్యులు బి.అనిల్‌కుమార్ రెడ్డి అన్నారు. కలువాయి మండలం బాలాజీరావుపేటలో బుధవారం జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం పనుల భూమిపూజ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నవరత్నాలు పథకంలో భాగంగా పేదలందరికీ సొంత ఇల్లు ప్రభుత్వం నిర్మించి ఇస్తుందని అన్నారు. కార్యక్రమంలో పార్టీ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి, ఎంపీపీ ఆర్ లక్ష్మీదేవి, సర్పంచ్ ఎస్.సురేష్‌రెడ్డి, ఎంపీటీసీ ప్రసాద్, నాయకులు సోమల మోహన్ రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వాసి తగ్గని ధాన్యరాశి!



1948 నుంచే జిల్లాలో నూతన వరి వంగడాలకు రూపకల్పన

- ఇప్పటికే 29 రకాలను సృష్టించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు
- దేశీయంగా వాడుకలో నెల్లూరు మొలగొలకులు టాప్
- జింక్ బాగా ఉండే ఎన్ఎల్ఆర్ 3238 వంగడం ఇటీవల మార్కెట్‌లోకి
- తెగుళ్లను తట్టుకొనే వంగడంగా దీనికి ప్రత్యేక గుర్తింపు
- నూతన సాంకేతిక పరిజ్ఞానంపై ఎప్పటికప్పుడు అన్నదాతలకు అవగాహన

ఎన్ఎల్ఆర్ 3238 రకం వరి పైరు



ధాన్యపు సిరిగా, అన్నపూర్ణగా ప్రసిద్ధి చెందిన సింహపురిలో వాసి తగ్గని ధాన్యపురాశులు పండించే వంగడాలను శాస్త్రవేత్తలు సృష్టిస్తున్నారు. దశాబ్దాల కాలంగా అనేక రకాల వంగడాలను సృష్టిస్తూ దేశవ్యాప్తంగా కర్షకులకు పరిచయం చేస్తున్నారు. వ్యవసాయానికి ప్రాధాన్యత ఉన్న జిల్లాలో వరికి సంబంధించిన అనేక రకాల వంగడాలు ఇక్కడి నుంచే కనుగొనడం విశేషం.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం నుంచి ఇప్పటి వరకు 29 రకాల కొత్త వరి వంగడాలను మార్కెట్‌లోకి తీసుకువచ్చారు. ప్రధానంగా 1948 నుంచి కొత్త వంగడాలను శాస్త్రవేత్తలు కనుగొంటూ రైతులకు అందిస్తున్నారు. బీసీపీ 1, బీసీపీ 2 అనే రెండు రకాల కొత్త వంగడాలను 1948లో శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఆ తరువాత 3, 4 వంగాలను 1950లో, 5ని 1951, 6ని 1965లో, బల్క్‌హెచ్ 9ని 1965లో కనుగొన్నారు. కొత్త మొలగొలకులు 72 అనే రకాన్ని 1977లో మార్కెట్‌లోకి తీసుకువచ్చారు. కొత్త మొలగొలుకులు 74 పేరుతో మరో రకాన్ని 1977లో తీసుకుని వచ్చారు. తరువాత పినాకిని ఎన్ఎల్ఆర్ 9672ని 1987లో, తిక్కన ఎన్ఎల్ఆర్ 27999ను 1988లో తీసుకువచ్చారు. ఇంకా సింహపురి, శ్రీరంగ, స్వర్ణముఖి, భరణి, శ్రావణి, స్వాతి, పెన్నా, సోమశిల, వేదగిరి, అపూర్వ, నెల్లూరు మసూరి, నెల్లూరు సుగంధ రకాలను కనుగొన్నారు. ఈ విధంగా 29 రకాల వరి కొత్త వంగడాలను జిల్లా శాస్త్రవేత్తలు రైతులకు అందించారు.

నాలుగు రాష్ట్రాల్లో అధికం

నెల్లూరులో కనిపెట్టిన నెల్లూరు మసూరి రకం ధాన్యం ఎక్కువగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రంలో సాగులో ఉండడం గమనార్హం. అదే విధంగా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలో కూడా ఈ రకం ధాన్యం సాగు చేయడం విశేషం. నెల్లూరు నుంచి వచ్చిన ఈ వంగడాన్ని నాలుగు రాష్ట్రాల్లో సాగు చేస్తుండడంతో దీనికి చాలా ప్రాముఖ్యత వచ్చింది.

ఐదేళ్ల తర్వాత

ఎంటీయూ 1010, బీపీటీ 5204 సంకరంతో ఎన్ఎల్ఆర్ 3238ను సృష్టించినట్లు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు వివరిస్తున్నారు. ఈ వంగడం అభివృద్ధి వెనుక అనేకమంది వ్యవసాయ శాస్త్రవేత్తల కృషి ఉంది. స్వల్పకాలంలో అధిక దిగుబడి ఇచ్చే వంగడాల సృష్టిలో భాగంగా ఈ రకాన్ని వృద్ధి చేశారు. అనేక ప్రయోగాలు, క్షేత్రస్థాయి ప్రదర్శనల అనంతరం ఐదేళ్ల తర్వాత ఈ వంగడం బయటకు వచ్చింది. తెగుళ్లను తట్టుకోవడం, అధిక దిగుబడి ఇవ్వడం ఎన్ఎల్ఆర్ 3238 ప్రత్యేకతగా నిపుణులు వివరిస్తున్నారు. దేశవ్యాప్తంగా పేరుగాంచిన బీపీటీ 5204తో సమానంగా ఈ వంగడం దిగుబడి ఇస్తుందని శాస్త్రవేత్తలు వివరిస్తున్నారు.

రైతులను చైతన్య పరుస్తూ...

జిల్లాలోని రైతులను ఎప్పటికప్పుడు శాస్త్రవేత్తలు చైతన్య పరుస్తూ కొత్త వంగడాలపై అవగాహన కల్పిస్తున్నారు. గ్రామాల్లో పర్యటించడం కాకుండా, పరిశోధనా స్థానంలో రైతులకు అనేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి రైతుల అభిప్రాయాలను, సూచనలను తీసుకుని ఆ దిశగా శాస్త్రవేత్తలు కొత్త వంగడాలపై దృష్టి కేంద్రీకరిస్తున్నారు. కొత్త వంగడాలు ఖరీఫ్‌లో, రబీలో ఏ విధంగా వేసుకుంటే పంటసాగు బాగుంటుంది, ఎంత మోతాదులో రసాయనాలు వాడాలి అనే విషయమై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

9 వంగడాలు ఫేమస్

నెల్లూరులోని వ్యవసాయ పరిశోధనా స్థానంలో సృష్టించిన వాటిలో 9 వంగడాలు చాలా చోట్ల వాడుకలోకి వచ్చాయి. ప్రధానంగా నెల్లూరు మొలగొలకులు (ఎన్ఎల్ఆర్ 9674), నెల్లూరు పార్థివ (ఎన్ఎల్ఆర్ 33892), నెల్లూరు మసూరి (34449), నెల్లూరు శ్వేత (ఎన్ఎల్ఆర్ 40024), నెల్లూరు భరణి (ఎన్ఎల్ఆర్ 30491), నెల్లూరు సోమశిల (ఎన్ఎల్ఆర్ 33358), నెల్లూరు ధాన్యరాశి (ఎన్ఎల్ఆర్ 3354), నెల్లూరు సోనా (ఎన్ఎల్ఆర్ 3041), నెల్లూరు స్వర్ణముఖి (ఎన్ఎల్ఆర్ 145)లు అధికంగా సాగుబడిలో ఉన్నాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. తాజాగా ఎన్ఎల్ఆర్ 3238 వచ్చి చేరింది. తెగుళ్లను తట్టుకునే శక్తి, అధిక దిగుబడి, రోగనిరోధక శక్తి పెంపొందించే జింక్ పుష్కలంగా ఉండడంతో రబీలో పంట పెట్టేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు.

ఏళ్ల తరబడి కష్టం ఉంది



జిల్లాలోని రైతులకు అనుగుణంగా, వారికి అవసరమయ్యే విధంగా వంగడాల సృష్టిపై ప్రత్యేక దృష్టిపెట్టాం. ఒక వంగడం పూర్తి స్థాయిలో బయటకు రావాలంటే చాలా సమయం పడుతుంది. అప్పటి వరకు అన్ని విధాలుగా శాస్త్రవేత్తలు పరిశీలన చేసి మార్కెట్‌లోకి తీసుకురావడం జరుగుతుంది. దీని వెనుక సంవత్సరాల తరబడి కష్టం ఉంటుంది.

–వినీత, ప్రధాన శాస్త్రవేత్త

వివిధ రకాల పరీక్షల తరువాతే..



వరి వంగడాలపై తాను ఎక్కువగా పరీక్షలు చేస్తుంటాను. వివిధ పద్ధతుల్లో పరీక్షలు చేయడంతో పాటు, విత్తనం బయటకు వచ్చిన తరువాత మరలా అనేక రకాలుగా ల్యాబ్‌లలో పరీక్షలు చేస్తాం. తాము ముందుగా సాగు పద్ధతిలో నిర్ధారించిన తరువాత రైతులకు అందిస్తాం. రైతులకు వినియోగానికి అనుకూలంగా ఉంటేనే వారికి అందజేస్తాం.

–లక్ష్మి, శాస్త్రవేత్త

జలపాతం చూసేందుకు వెళ్లి..



పెంచలకోన అడవుల్లో చిక్కుకుని సురక్షితంగా వచ్చిన అయ్యప్ప భక్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ మాల్యాద్రి

- పెంచలకోన అడవుల్లో చిక్కుకున్న గొలగమూడి, బుచ్చికి చెందిన భక్తులు
- రక్షించిన దేవస్థాన, పోలీసు, ఫైర్ సిబ్బంది

రాపూరు: రాపూరు మండలంలోని ప్రముఖ పుణ్య క్షేత్రం పెంచలకోనలో బుధవారం రాత్రి ఉత్కంఠ వాతావరణం నెలకొంది. జలపాతం వద్దకు వెళ్లిన తర్వాత భారీ వరద రావడంతో కొందరు పర్యాటకులు కోనలో చిక్కుకున్నారు. వారిని దేవస్థానం సిబ్బంది పోలీసులు సురక్షితంగా తీసుకొచ్చారు. పెంచలకోనలో గత రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు వెలుగొండ అడవుల్లో జలపాతాలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వాటిని చూసేందుకు బుధవారం మధ్యాహ్నం కొంత మంది భక్తులు వెళ్లారు. వారంతా తిరిగివచ్చే సమయంలో వరద ఉధృతంగా ప్రవహించడం, చీకటి పడడంతో కొంతమంది పెంచలకోనకు చేరుకోగా 11 మంది అడవుల్లోనే చిక్కుకుపోయారు. దీంతో కోనకు చేరుకున్న భక్తులు సమాచారాన్ని దేవస్థాన సిబ్బందికి, పోలీసు సిబ్బందికి తెలిపారు. దేవస్థాన సిబ్బంది హరీష్, పోలీసు సిబ్బంది ఏడుకొండలు, మరికొంతమందిలో కలసి లైట్లు, మైక్‌లు, రోప్‌లు తీసుకుని అరుచుకుంటూ అడవుల్లోకి వెళ్లారు. వారి అరుపులు విని కొండల్లో ఉన్న వారు వారి వద్దకు చేరుకుని రోప్‌ల సహాయంతో పెంచలకోనకు తీసుకు వచ్చారు. అడవిలో చిక్కుకున్న వారిలో ఐదుగురు అయ్యప్ప మాలవేసిన శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా గొలగమూడికి చెందినవారిగా పోలీసులు గుర్తించారు. మిగిలిన ఆరుగురు భక్తులు బుచ్చిరెడ్డిపాలెంకు చెందిన వారని చెప్పారు. వారంతా తమ వాహనాల్లో వెళ్లిపోయారని తెలిపారు. గొలగమూడికి చెందిన అయ్యప్ప భక్తులు వినీత్, లోకేష్, నితీష్, తేజ, వినయ్ అని ఎస్ఐ మాల్యాద్రి వివరించారు. పెంచలకోనలో 11 మంది గల్లంతైనట్లు సమాచారం రావడంతో పోలీస్, ఫైర్ సిబ్బంది కోనకు చేరుకున్నారు. జిల్లా అంతటా ఉత్కంఠ వాతావరణం నెలకొంది. అంతలోనే అందరు సురక్షితంగా రావడంతో ఊపిరి పీల్చుకున్నారు.

పారిశ్రామికవేత్తలకు సహాయ సహకారాలు



గోకుల్ ఆగ్రో రిసోర్సెస్ లిమిటెడ్ కంపెనీ ప్రారంభోత్సవంలో కలెక్టర్, ఇతర అధికారులు

- జిల్లాలో రూ.250 కోట్లతో వంటనూనె కంపెనీ ఏర్పాటు
- రూ.23.43 కోట్లతో నారంపేట ఇండస్ట్రియల్ పార్కులో అభివృద్ధి పనులు
- వర్చువల్‌గా శంకుస్థాపనలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



నారంపేట ఎంఎస్ఎంఈ సీడీపీ ఇండస్ట్రియల్ పార్కు అభివృద్ధికి వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొస్తున్న పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నట్లు కలెక్టర్ ఎం.హరినారాయణన్ పేర్కొన్నారు. బుధవారం ఉదయం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పలు జిల్లాల్లో పరిశ్రమల ఏర్పాటుకు వర్చువల్‌గా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. నెల్లూరు కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్ నుంచి కలెక్టర్ హరినారాయణన్, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, ఇండస్ట్రియల్ జీఎం సుధాకర్, ఏపీఐఐసీ జెడ్ఎం విజయరత్నం తదితరులు హాజరయ్యారు. జిల్లాకు సంబంధించి ముత్తుకూరు మండలం వెస్ట్ నాగులదొరువు గ్రామంలో రూ.250 కోట్లతో నిర్మించిన గోకుల్ ఆగ్రో రిసోర్సెస్ లిమిటెడ్ (వంటనూనెల కంపెనీ) ప్రారంభోత్సవం, ఆత్మకూరు మండలం నారంపేట గ్రామంలో రూ.23.43 కోట్లతో ఎంఎస్ఎంఈ సీడీపీ ఇండస్ట్రియల్ పార్కు రెండో దశ మౌలిక వసతుల కల్పనకు ముఖ్యమంత్రి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. వెస్ట్ నాగులదొరువు గ్రామంలో ఏర్పాటు చేసిన గోకుల్ ఆగ్రో రిసోర్సెస్ పరిశ్రమ వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా 1150 ఉద్యోగాలు లభిస్తాయని అన్నారు. ప్రతి రోజు సుమారు 1400 టన్నుల సన్‌ఫ్లవర్, పామ్ ఆయిల్ ఈ పరిశ్రమ ద్వారా ఉత్పత్తి అవుతుందన్నారు. అలాగే ఆత్మకూరు మండలం నారంపేట వద్ద ఇండ్రస్టియల్ పార్కులో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తూ, పరిశ్రమల ఏర్పాటుకు రాయితీలు, ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆత్మకూరు మండల పరిషత్ అధ్యక్షుడు కేతా వేణుగోపాల్ రెడ్డి, జడ్పీటీసీ సభ్యురాలు పెమ్మసాని ప్రసన్నలక్ష్మి మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గంలో పారిశ్రామికాభివృద్ధికి ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి కృషి అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో గోకుల్ ఆగ్రో రిసోర్సెస్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ రామాంజనేయులు, సురేష్, శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల చెంతకు ప్రభుత్వ కార్యాలయాలు

- జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఆనం అరుణమ్మ, చిత్రంలో రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: గ్రామాల చెంతకు ప్రభుత్వ కార్యాలయాలను తీసుకొచ్చి.. ప్రజల ఇక్కట్లను పరిష్కరించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ కొనియాడారు. కావలి రూరల్ మండలం చెంచుగానిపాళెంలో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్ర భవనాలను ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డితో కలిసి బుధవారం ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు. అన్ని ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సేవలను గ్రామ సచివాలయాల్లోనే అందించేలా చర్యలు చేపట్టారని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రజలకు సీఎం ఎంతో మేలు చేస్తున్నారని కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారని తెలిపారు. ఏఎంసీ చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్‌యాదవ్, జెడ్పీటీసీ జంపాని రాఘవులు, ఎంపీపీ కొండమ్మ, మాజీ ఎంపీపీ పత్రి మహేశ్వరి, గ్రామ సర్పంచ్ జంపాని జాలమ్మ, మాజీ జెడ్పీటీసీ కందుల శ్రీనివాసులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు జనిగర్ల మహేంద్రయాదవ్, కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కసమర్లపూడి వెంకటనారాయణ, గంగనగారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో జడివాన



నెల్లూరు స్టోన్‌హౌస్‌పేట ఏరియాలో..





వర్షపు జల్లుల సమయంలో ద్విచక్రవాహనాలపై వెళుతూ...

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో బుధవారం జడివాన కురిసింది. జిల్లాలోని రాపూరు, పొదలకూరు, కలువాయి, అనంతసాగరం, మర్రిపాడు, వింజమూరు, సంగం, కలిగిరి, కావలితో పాటు సముద్ర తీర మండలాల్లో ముసురుపట్టి ఎడతెరిపిలేకుండా వర్షం కురిసింది. గత వారం రోజుల నుంచి కురుస్తున్న చెదురుమదురు వర్షాలతో రైతాంగం వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. జిల్లా అంతటా వర్షం కురుస్తుండడంతో ఆయా ప్రాంతాల్లో రైతులు నారుమడుల సాగు వైపు దృష్టి సారిస్తున్నారు. పలు ప్రాంతాల్లో వర్షాలకు వాగులలో నీరు చేరుతోంది. మొత్తం మీద గత వారం రోజులుగా కురుస్తున్న వర్షం రైతులకు మేలే చేస్తోంది. పైతట్టు ప్రాంతాల్లో మరింతగా వర్షాలు కురిసి జలాశయాలకు ఇన్‌ఫ్లో పెరిగితే ఇక సాగునీటి కష్టాలకు చెక్ పడనుంది. నెల్లూరు నగరంలోని పల్లపు ప్రాంతాలు బుధవారం కురిసిన వర్షానికి జలమయం అయ్యాయి. దీంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

– నెల్లూరు(దర్గామిట్ట)

నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

సైదాపురం: నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఆత్మకూరు డీఎస్పీ కోటారెడ్డి పేర్కొన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా సైదాపురం పోలీసు స్టేషన్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసుస్టేషన్‌లో ఇప్పటి వరకు జరిగిన నేరాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించామన్నారు. ఎన్ని చోరీలు జరిగాయి? వాటి రికవరీ ఎలా చేశారు అనే విషయాలపై ఆరా తీశామన్నారు. తమ సబ్ డివిజన్ పరిధిలో ఎలాంటి నేరాలు జరగకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట రాపూరు సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్సై వాసు ఉన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ కోటారెడ్డి

పాడి రైతులకు అండగా..

పశు సంరక్షణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- జిల్లాలో రెండు లక్షల పశు ఆరోగ్య సంరక్షణ కార్డుల పంపిణీ
- ఇప్పటికే ఆరు లక్షలకుపైగా గాలికుంటు టీకాలు
- మరో 28 వేల బ్రూసెల్లా టీకాలు

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలో వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమకు ప్రత్యేక స్థానం ఉంది. వ్యవసాయానికి అనుబంధంగా పాడి పరిశ్రమను ఏర్పాటు చేసుకొని ఎక్కువ మంది రైతులు జీవనం సాగిస్తున్నారు. దీనికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తోంది. పాడి రైతుల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేస్తూ అండగా నిలుస్తోంది. పశువుల సంరక్షణతోనే పాడి పరిశ్రమ అభివృద్ధి చెందుతుందని భావించి ప్రత్యేకంగా వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. పశువుల్లో వచ్చే సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తుగా ఉచితంగా టీకాలను వేస్తోంది.

ఆరు లక్షలకుపైగా టీకాలు

జిల్లాలో 6.47 లక్షల వరకు ఆవులు, గేదెలున్నాయి. అలాగే 14.8 లక్షల వరకు మేకలు, గొర్రెలు ఉన్నాయని అంచనా. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని మూగజీవాల సంరక్షణపై పశుసంవర్ధక శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. పశువులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ముందస్తుగా ఆరు లక్షలకుపైగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. అదే విధంగా ఇప్పటికే 19 వేల పశువులకు బ్రూసెల్లా టీకాలను వేశారు.



పశుసంరక్షణ కార్డులపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

మరో తొమ్మిది వేల టీకాలను వేసేందుకు చర్యలు ప్రారంభించారు.

రెండు లక్షల పశు సంరక్షణ కార్డులు

మూగ జీవాల సంరక్షణకు సంబంధించి ప్రభుత్వం ప్రత్యేకంగా పశు సంరక్షణ కార్డులను తయారు చేసి పాడి రైతులకు పంపిణీ చేస్తోంది. ఆరు పశువులు, 20 మేకలు లేదా గొర్రెలకు ఒక కార్డు చొప్పున పంపిణీ చేస్తోంది. ఈ కార్డులో మూగజీవాలకు సంబంధించిన పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. తద్వారా వాటికి ఎటువంటి అనారోగ్యం తలెత్తినా వెంటనే చికిత్స చేసేందుకు వీలు ఏర్పడనుంది. అలాగే పశువులు, జీవాలను ఎవరైనా దొంగతనంగా తీసుకెళ్లినా వాటిని పట్టుకునేందుకు అవకాశం ఉంటుందని పశుసంవర్ధక శాఖ అధికారులు చెప్తున్నారు. జిల్లాలో రెండు లక్షల హెల్త్ కార్డులను పంపిణీ చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకోగా, ఇప్పటి వరకు 11 వేల కార్డులను పాడి రైతులకు పంపిణీ చేశారు. మిగిలిన వాటిని గ్రామాల వారీగా పశుసంవర్ధక శాఖ అధికారులు పంపిణీ చేస్తున్నారు.



పశు సంరక్షణ కార్డులను పంపిణీ చేస్తున్న అధికారులు (ఫైల్)

ఉచితంగా సంచార పశు ఆరోగ్య సేవలు

పాడి పశువులకు ఆరోగ్య సమస్యలు తలెత్తితే వాటిని ఆస్పత్రులకు తీసుకెళ్లేందుకు రైతులు ఎన్నో వ్యయ ప్రయాసాలకు గురికావాల్సి వస్తోంది. ఈ సమస్యను గుర్తించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 108 అంబులెన్స్‌ల తరహాలో ప్రత్యేకంగా పశువుల కోసం వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. మూగజీవాలకు అత్యవసర వైద్యం కావాల్సి వస్తే 1962 నంబర్‌కు ఫోన్ చేస్తే మొబైల్ వాహనం ద్వారా వెటర్నరీ డాక్టర్లు ఇంటి వద్దకే చేరుకొని సేవలను అందించనున్నారు. జిల్లాలో 19 సంచార పశు ఆరోగ్య సేవ వాహనాలు ఉండగా, గత ఏడు నెలల కాలంలో 34,250 మూగజీవాలకు చికిత్సను అందించారు.

ఉచితంగా టీకాలు



పాడి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటోంది. పశువుల ఆరోగ్య సంరక్షణకు అధిక ప్రాధాన్యమిస్తూ ఉచితంగా వ్యాధి నిరోధక టీకాలను వేస్తోంది. పశు ఆరోగ్య సంరక్షణ కార్డులను పంపిణీ చేస్తోంది. ఈ కార్డులతో పాడి రైతులకు ఎంతో మేలు జరుగుతోంది. పశువులకు వైద్యం సత్వరమే అందేలా చర్యలు చేపడుతున్నాం.

– మహేశ్వరుడు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి

వెంటనే స్పందిస్తున్నాం



జిల్లాలో 19 వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ వాహనాలు ఉన్నాయి. వీటి ద్వారా పశువులకు అత్యవసర సమయాల్లో వైద్యం అందిస్తూ ప్రాణాలను కాపాడుతున్నాం. పాడి రైతులు సంచార పశు ఆరోగ్య సేవ వాహనాలను సద్వినియోగం చేసుకోవాలి.

– శివశంకర్, వెటర్నరీ అంబులెన్స్‌ల జిల్లా మేనేజర్

ప్రజా శ్రేయస్సే సీఎం జగన్ లక్ష్యం



ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిపై బుక్‌లెట్‌ను అందజేస్తున్న రాజగోపాల్‌రెడ్డి

- మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

ఉదయగిరి: ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా జనరంజన పాలనను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సాగిస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అప్పసముద్రంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మాజీ ఎంపీపీ చేజర్ల సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధికి సంబంధించిన బుక్‌లెట్లను అందజేసిన అనంతరం రాజగోపాల్‌రెడ్డి మాట్లాడారు. అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. తొలుత దివంగత సీఎం వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన్ను పలువురు సత్కరించారు. పార్టీ మండల కన్వీనర్ గానుగపెంట ఓబుల్‌రెడ్డి, జెడ్పీటీసీ రామాంజనేయులు, సొసైటీ అధ్యక్షుడు కల్లూరి రమణారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ అలీ అహ్మద్, పార్టీ దుత్తలూరు కన్వీనర్ వాసుదేవరెడ్డి, ఎంపీటీసీ సుభానీ, దాసరపల్లి సర్పంచ్ గౌస్‌మొహిద్దీన్, మాజీ సర్పంచ్‌లు సుబ్బారెడ్డి, మూలి సుబ్బారెడ్డి, అక్కుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొదలకూరు నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.45
సన్నవి : రూ.25
పండ్లు : రూ.8

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్:	రూ.80	స్కిన్‌లెస్ చికెన్ :	రూ.170
లేయర్ :	రూ.95	లేయర్ చికెన్ :	రూ.162
బ్రాయిలర్ చికెన్:	రూ.150		

టెక్నాలజీకి మారుపేరు భారతి సిమెంట్

అల్లూరు: అత్యాధునిక టెక్నాలజీతో భారతి సిమెంట్ తయారవుతోందని ఆ సంస్థ టెక్నికల్ ఆఫీసర్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. స్థానిక లక్ష్మీ ఏజెన్సీ కేంద్రంలో తాపీ మేస్త్రీలకు అవగాహన సదస్సును భారతి సిమెంట్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మార్కెట్లో లభించే ఇతర సిమెంట్లతో పోలిస్తే అత్యాధునిక టెక్నాలజీతో తయారవుతున్న భారతి అల్ట్రా ఫాస్ట్ సిమెంట్‌తో నిర్మాణ ప్రక్రియ వేగవంతమవుతుందని చెప్పారు. తాపీమేస్త్రీలకు రూ.లక్ష విలువజేసే ప్రమాద బీమా సర్టిఫికెట్లను అందజేశారు. భారతి సిమెంట్ సంస్థ సేల్స్ ఆఫీసర్ మణికుమార్, లక్ష్మీ స్టీల్స్ అండ్ సిమెంట్ డీలర్ మేడా మాధవ్ తదితరులు పాల్గొన్నారు.



తాపీమేస్త్రీలకు ప్రమాద బీమా సర్టిఫికెట్లు అందజేస్తున్న సంస్థ సభ్యులు

గంగపట్నంలో న్యాయ విజ్ఞాన సదస్సు

ఇందుకూరుపేట: మండలంలోని గంగపట్నం ఎస్టీ కాలనీలో న్యాయ విజ్ఞాన సదస్సును బుధవారం నిర్వహించారు. న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామిని ఆదేశాల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వాణి మాట్లాడారు. ప్రభుత్వం అందించే న్యాయ సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తహసీల్దార్ సుబ్బయ్య, ఐటీడీఏ అధికారి శ్రీనివాసులు, ఏఎస్సై భాస్కర్‌రాజు, పారా లీగల్ వలంటీర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వాణి

క్రీడలను ప్రోత్సహించేందుకే ‘ఆడుదాం.. ఆంధ్రా’

రాపూరు:క్రీడలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఆడుదాం.. ఆంధ్రా పేరిట క్రీడా పోటీలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోందని రాపూరు మండల ప్రత్యేకాధికారి తిరుపతయ్య పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, పీఈటీలు, కార్యదర్శులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల స్థాయిలో డిసెంబర్ 15 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 8 వరకు పోటీలను నిర్వహించనున్నారని వివరించారు.

కండలేరులో నీటి నిల్వ

రాపూరు: కండలేరులో 11.085 టీఎంసీల నీరు నిల్వ ఉందని ఈఈ విజయ్ కుమార్‌రెడ్డి తెలిపారు. వరద కాలువ నుంచి 200 క్యూసెక్కుల నీరు చేరుతోందని చెప్పారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 40, పిన్నేరువాగు, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు ఐదు చొప్పున, లోలెవల్ స్లూయిజ్‌కు 235 క్యూసెక్కులను విడుదల చేస్తున్నామన్నారు.

గేదెలను ఢీకొన్న బైక్

- ఇద్దరికి గాయాలు

సంగం: గేదెలను బైక్ ఢీకొనడంతో ఇద్దరు గాయపడిన ఘటన మండలంలోని సిద్ధీపురం, దువ్వూరు మార్గమధ్యలో నెల్లూరు–ముంబై జాతీయ రహదారి బుధవారం చోటుచేసుకుంది. వివరాలు.. సిద్ధీపురానికి చెందిన దినేష్‌నాయుడు, శీనయ్య పనిపై దువ్వూరు వెళ్లారు. అనంతరం తిరిగొస్తుండగా, మార్గమధ్యలో గేదెలను ఢీకొని గాయపడ్డారు. క్షతగాత్రులను 108లో ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

మొబైల్ ఫోన్ అపహరణ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఇంట్లో చార్జింగ్ పెట్టిన మొబైల్ ఫోన్‌ను ఆగంతకుడు చోరీ చేసిన ఘటన వెంకటేశ్వరపురంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలు.. నగరంలోని 53వ డివిజన్ పరిధిలో గల శ్రీవాణి ఇంగ్లిష్ మీడియం స్కూల్ సమీపంలో రేష్మా తన కుటుంబసభ్యులతో కలిసి ఉంటున్నారు. ఈ క్రమంలో సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో ఇంటి నుంచి ఆమె బయటకెళ్లారు. ఈ తరుణంలో రూ.30 వేల విలువైన మొబైల్ ఫోన్‌ను చార్జింగ్ పెట్టి ఆమె కుమారుడు నిద్రించారు. కొద్దిసేపటి తర్వాత గమనించగా, ఫోన్ మాయమైంది. చుట్టుపక్కల ఆరా తీసినా ప్రయోజనం లేకపోవడంతో నవాబుపేట పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేశారు.

విద్యుదాఘాతానికి మూగజీవం బలి



ఇందుకూరుపేట : మండలంలోని మైపాడులో విద్యుదాఘాతానికి మూగజీవం బలైన ఘటన బుధవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఊటుకూరు రమణయ్య తన రెండు ఎడ్లను బండికి కట్టుకొని పొలంలో పనిచేస్తుండగా ఒక ఎద్దు పక్కనే ఉన్న స్తంభానికి తగిలింది. దీంతో విద్యుత్ షాక్‌కు గురైన ఎద్దు అక్కడికక్కడే మృతిచెందగా యజమాని రమణయ్య, మరో ఎద్దు త్రుటిలో ప్రమాదం నుంచి బయటపడ్డాయి. ఎద్దు విలువ సుమారు రూ.80 వేల వరకు ఉంటుందని స్థానికులు తెలిపారు.